# కథ

# శ్రీవైద్యనాథం నమోస్తుతే

## (జ్యోతిర్లింగ మహిమ)

"నమః పార్వతీ పతయే! హరహర మహాదేవ!" జేగంట మ్రోగిస్తూ హారతి ఇస్తున్నాడు మృకండు మహర్షి!

శివపూజను విధి విధానంగా ముగించి కర్పూర హారతి చూపి లేచి నిలబడి మంత్రపుష్పం చదువుతున్నాడు.

"తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి!
తన్నో రుద్రఃప్రచోదయాత్..
ఈశాన్న సర్వవిద్యానాం, ఈశ్వర సర్వభూతానాం,
బ్రహ్మాదిపతి బ్రహ్మణోది పతిబ్రహ్మ..శివోమే అస్తు సదాశివోం!"

తండ్రితోపాటు శ్రావ్యంగా గొంతు కలిపి మంత్రపుష్పం చెబుతున్న కుమారుడివైపు మురిపెంగా చూస్తూ వుండిపోయింది మరుద్వతి! 'నా చిన్నారి తండ్రికి ఈ లేత వయసులోనే ఎంతటి భక్తిప్రపత్తులో ఆ పరమేశ్వరుడిపైన! ఆ స్వామి కరుణతో జన్మించిన వరపుత్రుడు గదామరి! కానీ పిల్లలు లేని కొరత తీర్చిన ఆ మహాదేవుడు తమ పట్ల ఎందుకంత కఠినత్వం చూపినట్లు. పుత్రుని ముద్దుముచ్చటలు చూసి, ఆపైన ప్రయోజకుడైన అతని చేతుల్లో కడతేరాలనే కదా ఏ తల్లైనా కోరుకునేది. ఆ సహజమైన కోరిక తీరే అవకాశం తనకు లేదు కదా!' అన్న ఆలోచన కలిగేసరికి హృదయం వేదనతో నిండిపోయింది.

"అమ్మా! ప్రసాదం తీసుకో. ఏమిటి ఆలోచిస్తున్నావు?" అని హెచ్చరించడంతో ఉలిక్కిపడి ఆలోచనలనుండి తేరుకుంది మరుద్వతి. ప్రసాదం అందుకుని కళ్లకద్దుకుంటూ "ఏం లేదు నాయనా! అపరాహ్ణమౌతున్నది. పద భోజనం చేద్దువుగాని" అన్నది కొడుకు ముఖంలోకి ఆర్తిగా చూస్తూ.

చిన్నగా నవ్వాడు మార్కండేయుడు.

"ఇవాళ మహాశివరాత్రి గదా! నాన్నగారితో నేనూ ఉపవాస, జాగరణ దీక్షలు వహించి శివారాధనలోనే కాలం గడుపుతానన్న విషయం మరిచావా? భోజనం పెడతానంటున్నావే" అడిగాడు ఆశ్చర్యంగా.

"అవునులే, కానీ పసివాడివి, నీకెందుకా దీక్షలన్నీ. ఇవాళెందుకో నీకు నా చేతులతో అన్నం కలిపి తినిపించాలని కోరికగా వుంది. రా కన్నా, నా బంగారు తండ్రివి కదూ" అంటూ బ్రతిమాలింది మరుద్వతి, మనసులో దిగులు మాటల్లో తొంగిచూడకుండా జాగ్రత్తపడుతూ.


అప్పుడే పూజ ముగించి వచ్చిన మృకండుముని కుమారుడిని వాత్సల్యంగా దగ్గరకు తీసుకున్నాడు.

"మరుద్వతి! నీవు వెళ్లి పనులు చూసుకో. మేమలా బయటకు వెళ్లివస్తాము" అంటూ మార్కండేయుని చేయి పట్టుకుని బయలుదేరాడు.

ఈ విధంగా చేయిపట్టి నడిచే భాగ్యం ఇక కొద్దిరోజుల్లో ముగిసిపోతుంది. మార్కండేయుని ఆయుర్దాయం తీరిపోనున్నదన్న నగ్నసత్యం వికటంగా నవ్వుతూ కళ్లముందే నిలుస్తున్నది. మనశ్శాంతిని దూరం చేస్తున్నది. అభం, శుభం తెలియని పసివాడికి ఈ విషయం తెలిస్తే ఇంకేమైనా వుందా! పరి పరి విధాలుగా ఆలోచిస్తూ సాగుతున్న మృకండుమునిని ఆపుతూ "తండ్రిగారూ! మనం వెళ్లవలసింది శివాలయానికేగదా!" అడిగాడు మార్కండేయుడు. ఎప్పుడూ వెళ్ళే బాట కాకుండా మరోత్రోవ వెంట నడవటం గమనించి ఆగాడు మృకండుముని. "దారి తప్పాంగదూ. పరధ్యానంగా నడుస్తూ చూడనే లేదు నేను" అన్నాడు.

'ఇవాళెందుకు తల్లిదండ్రులిద్దరూ వింతగా ప్రవర్తిస్తున్నారు. వాళ్లు దాచాలనుకున్నా ఏదో దిగులు, భయం వాళ్ళ కళ్ళలో, మాటల్లో వ్యక్తమౌతూనే వున్నాయి. అందుకు కారణం ఏమై వుంటుంది?' అనుకున్నాడు మార్కండేయుడు.

ఇద్దరూ వెనుదిరిగి త్వరత్వరగా నడిచి గుడివద్దకు చేరేసరికి అక్కడ మునులందరూ చేరి శివపురాణం చదువుతున్నారు.



"ఈ మహాశివరాత్రి పర్వదినాన్నే పరమేశ్వరుడు దేవాసురుల వల్ల జరిగిన సముద్ర మథనంలో ప్రప్రథమంగా వెలువడిన కాలకూట విషాన్ని పట్టి తన కంఠంలో బంధించి 'నీలకంఠుడు'గా ప్రసిద్ధి చెందాడు. లోకాలను విషజ్వాలల నుండి పరిరక్షించాడు. అంతే కాదు, ఆఖరుకు వెలువడ్డ అమృతభాండంలో నుండి ఎన్నెన్నో ఓషధీతత్వాలుగల పద్నాలుగు అనర్ఘ్యమైన అమృత రత్నాలు వెలువడ్డాయి. వాటిని రాక్షసులపాలు కాకుండా మహావిష్ణువు ఆ రత్నాలను పరమేశ్వరుని జ్యోతిర్లింగరూపంలో నిక్షిప్తం చేసాడు. దేవతల కోరికపై ఆ జ్యోతిర్లింగం భూమిపై వెలిసి అమృతేశ్వరుడనీ, వైద్యనాథుడనీ కీర్తింపబడుతూ పూజింపబడుతున్నది. అమృతమూ, ఓషధీతత్వాలు గల రత్నగర్భ కావడంతో ఈ జ్యోతిర్లింగ స్పర్శనం వ్యాధులను ఉపశమింపజేసి, ఆయురారోగ్యాలు ప్రసాదిస్తుందని అభయమిచ్చాడు వైద్యనాథుడైన పరమశివుడు. ఆ స్వామి కృపవల్ల ఎల్లవేళలా అందరినీ పరిరక్షిస్తూ వుండాలని నిర్మల హృదయాలతో ప్రార్థిద్దాం!

-డా. టి.కళ్యాణి

“జయ జయ విశ్వేశ్వర, విరూపాక్ష, విశ్వరూప, సదాశివ!
శరణం భవ భూతేశ, కరుణాకర శంకర!!
హరశంభో మహాదేవ! విశ్వేశా, అమరవల్లభ!
శివశంకర సర్వాత్మన్, నీలకంఠ నమోస్తుతే!!
మృత్యుంజయాయ, రుద్రాయ, వైద్యనాథాయ, శంభవే!
అమృతేశాయ, సర్వాయ, శ్రీమహాదేవయే నమః!!
ఏతాని శివనామాని యఃపఠేత్ సతతం నరః
తస్య మృత్యు భయం నాస్తి! సర్వత్ర విజయా భవేత్!!”

అందరితోపాటు గొంతు కలిపి ప్రార్థిస్తున్న మృకండు మహర్షి హృదయంలో ఏదో భావన తళుక్కుమనడంతో, అంతవరకు వుండిన భయాందోళనలు ఒక్కసారిగా మాయమైనాయి. తేలికపడిన మనసుతో మార్కండేయుడిని దగ్గరకు తీసుకుని ఒక ప్రక్కగా కూర్చున్నాడు. మెల్లని స్వరంతో చెప్పసాగాడు.

“నాయనా మార్కండేయా! ఎంతోకాలం సంతానం లేక అలమటించిన మాపై కరుణతో ఆ పరమేశ్వరుడు ప్రసాదించిన వరపుత్రుడివి నీవు. కానీ మా అభాగ్యవశాన అల్పాయుష్కుడివైనావు. నీ ఆయుర్దాయం ఎనిమిది సంవత్సరాలేనన్న నిర్ణయం మమ్మల్నెంతగానో కృంగదీసింది. ముద్దుమురిపాలతో మమ్మల్ని అలరిస్తూ దినదిన ప్రవర్ధమానుడవవుతున్న నిన్ను చూసి ఒక వైపు ఆనందం, మరోవైపు ఆందోళన మాలో చోటు చేసుకునేవి. మరికొద్దిరోజుల్లో నీ ఆయుర్దాయం తీరిపోబోతున్నదన్న దిగులే ఇప్పటి మా మానసిక చింతకు కారణం. నిన్ను ఏ విధంగా దక్కించుకోవాలో తెలియక మథనపడిపోతున్న నాకు ఆ పరమేశ్వరుడే ఒక మార్గం చూపినట్లు భావిస్తున్నాను. నాయనా! నేను చెప్పేది శ్రద్ధగా విను. నీవిప్పుడే బయలుదేరి ఇక్కడికి సమీపంలో మేరు పర్వతపాదంలో వెలసిన వైద్యనాథ జ్యోతిర్లింగాన్ని దర్శించి అక్కడ శివారాధన కొనసాగించు. నిన్ను అల్పాయుష్కుడవని తెలిసిన ఆ స్వామే కరుణించి చిరాయువుగా దీవించవచ్చు. వెళ్లిరా నాయనా. నీ రాకకోసం వేయికళ్లతో ఎదురుచూస్తూ వుంటాము. పరమేశ్వరుని అనుగ్రహం పొంది తిరిగిరా!” అంటూ ఆశీర్వదించి పంపాడు. వైద్యనాథ జ్యోతిర్లింగాన్ని చేరి భక్తిగా నమస్కరించాడు మార్కండేయుడు. అక్కడే కూర్చుని కళ్లు అరమోడ్చి శివనామ జపంలో మునిగిపోయాడు.

“అదుగో! అక్కడ కూర్చుని వున్నాడు. ఆ బాలుడే! పద! వెళ్లి పట్టుకుందాం” అప్పుడే అక్కడకు వచ్చిన యమదూతలు లోపలకు వెళ్లబోయి, విద్యుద్ఘాతం తగిలినట్లుగా ఆగిపోయారు.

“ఏమిటీ వింత. ఆ బాలుడి సమీపంలోకి వెళ్లనీయకుండా లింగం నుండి వెలువడుతున్న తీక్షణ జ్వాలలు నిరోధిస్తున్నాయి. వెళ్లి ఈ విషయం ప్రభువులకు విన్నవించవలసిందే” అనుకుంటూ యమలోకానికి తిరిగి వెళ్లారు.

“ప్రభూ! ఆయుష్షు తీరిన మునిబాలకుడి ప్రాణం తీసుకురావడానికి వెళితే మా కార్యానికి అడ్డు తగిలాయి మహాదేవుని లింగంనుండి వెలువడిన జ్వాలలు. మమ్మల్ని క్షమించండి” అంటూ విన్నవించుకున్నారు భయంతో వణుకుతూ.

“విధి నిర్ణయానికి అవరోధమా. ఆ పరమేశ్వరుడు ఏర్పరచిన విధానం సక్రమంగా నెరవేర్చకపోవడం అపరాధమే అవుతుంది. ఆయుష్షు తీరిన ప్రాణి తప్పక ఈ లోకానికి రావలసిందే. నేనే వెళ్లి స్వయంగా తీసుకు వస్తాను” అంటూ చేతిలో యమపాశాన్ని ధరించి తరలివెళ్లాడు యమధర్మరాజు.

‘ఆహా! వైద్యనాథ జ్యోతిర్లింగం వెలసిన పవిత్ర స్థానమిది. అందుకే తన భటులకు ప్రవేశం దుర్లభమైంది. కానీ కర్తవ్య నిర్వహణలో వచ్చిన తనను అడ్డగించవలసిన ఆవశ్యకత ఆ మహాదేవునికెందుకు కలుగుతుంది? ఆ బాలుని ఆయుర్దాయం నేటితో తీరిపోయింది గదా!’ అనుకుంటూ పాశాన్ని వదిలాడు. తనను బంధించ ప్రయత్నిస్తున్న యమపాశాన్ని తప్పించుకోవటానికన్నట్లు రెండుచేతులూ సాచి లింగాన్ని గట్టిగా పెనవేసుకున్నాడు మార్కండేయుడు!

“పరమేశ్వరా పాహి! పాహి! ఈ యమపాశం పట్టునుండి నన్ను రక్షించు తండ్రీ!” అంటూ ఎలుగెత్తి పిలిచాడు. భయంతో గజగజలాడుతున్న ఆ పసివాడివైపు వికటంగా చూస్తూ-“ఓ మునిబాలకా! యమపాశం పట్టునుండి విడిపించుకోవడం అసాధ్యమని ఎరుగవా. ఆ పరమేశ్వరుడు నిర్ణయించిన నీ ఆయుర్దాయం ముగిసింది. అందుకే నీ ఎదుట నిలిచాను నేను మృత్యువునై కబళించడానికి” అన్నాడు యమధర్మరాజు.

“ఆ! ఆగు సమవర్తి. నీవు మృత్యువువే కానీ ఆ బాలుడు మృత్యుంజయుడు. అతడిని నీ పాశం ఏమీ చేయలేదు” అంటూ ప్రత్యక్షమైనాడు పరమేశ్వరుడు.

“హరహర మహాదేవ. శంభోశంకర. మీ ఆనతిని నేను మీరగలనా స్వామీ! మొదట అల్పాయుష్కుడుగా నిర్ణయించిన తమరే ఇప్పుడు ఈ బాలుడికి మృత్యుంజయునిగా అభయప్రదానం కావిస్తున్నారు. ఏమిటీ లీలా విశేషం ప్రభూ!” అన్నాడు యమధర్మరాజు వినయంగా నమస్కరిస్తూ.

“అది ఈ జ్యోతిర్లింగ మహిమ. వైద్యనాథ జ్యోతిర్లింగదర్శనం, స్పర్శనం దీర్ఘాయువును ప్రసాదిస్తాయన్న విషయం మరిచావా. ఈ జ్యోతిర్లింగ సేవనంతో పునీతుడైనాడు మార్కండేయుడు. సకల వేద శాస్త్రాలను అధ్యయనం చేసి, ఎన్నో పురాణాలను రచించి భావితరాలకు అందజేసి, శివారాధనాతత్పరుడై చిరంజీవిగా వర్ధిల్లుతాడు!” ప్రసన్నంగా ఆశీర్వదించి అంతర్ధానం చెందాడు పరమేశ్వరుడు.

“దేవాధిదేవా! నాపైన ఇంతటి కృపను వర్షించిన మీకివే నా శతకోటి ప్రణామాలు” భక్తి పారవశ్యంతో ప్రణమిల్లాడు మార్కండేయుడు.

ఈశ్వరానుగ్రహంతో తిరిగి వచ్చిన కుమారుడిని చూసి ఆనందంతో మైమరచిపోయారు మృకండుముని దంపతులు.

“తండ్రీ! మీ ఆశీర్వాదం ఫలించింది. వైద్యనాథ జ్యోతిర్లింగ సేవనంతో సంతుష్టుడైన పరమేశ్వరుడు నన్ను యముని బారి నుండి రక్షించాడు. చంద్రశేఖరుడైన ఆ స్వామిని ఆశ్రయించిన వారికి మృత్యుభయం ఉంటుందా?

“చంద్రశేఖర, చంద్రశేఖర, చంద్రశేఖర పాహిమామ్!
చంద్రశేఖర్, చంద్రశేఖర, రక్షమామ్!
రత్నసాను శరాసనం రజతాద్రి శృంగ నికేతనం!
శింజినీకృత పన్నగేశ్వర మచ్యుతానల సాయకం!
క్షిప్రదగ్ధ పురత్రయం త్రిదశాలయైరభి వందితం
చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః!”

మార్కండేయుడు రచించిన చంద్రశేఖరాష్టకం అపమృత్యుభయాన్ని తొలగించి పూర్ణాయురారోగ్యాలు ప్రసాదిస్తుంది.

మార్కండేయునిచే పూజింపబడిన వైద్యనాథ జ్యోతిర్లింగం మహారాష్ట్రలోని ‘పరలి’ గ్రామంలో వున్నది. ఈ గ్రామాన్ని కాంతీపురమని, వైజయంతీ క్షేత్రం అని కూడా పిలుస్తారు. కాశీక్షేత్రానికున్నంత మహత్యం కలిగివుండటం వల్ల ‘అపూర్వ (అనోఖా)కాశీ’ అని ప్రఖ్యాతి పొందింది.

రత్నగర్భగా, ఓషధీ తత్వాలు నెలకొన్న లింగంగా పురాణాలలో వర్ణించబడ్డ వైద్యనాథలింగం ఎత్తైన ప్రదేశంలో రాతితో నిర్మింపబడిన పెద్ద మందిరంలో వున్నది.

చైత్ర పడవా (ఉగాది)నాడు, విజయదశమి, మహాశివరాత్రి పర్వదినాలలో మందిరంలో విశేష పూజలు, ఉత్సవాలు నిర్వహింపబడుతాయి. మందిర సమీపంలో మార్కండేయుని పేరుతో సరస్సు వున్నది. జగద్గురు ఆదిశంకరాచార్యులు పరలీ క్షేత్రంలోని వైద్యనాథుని దర్శించి ప్రస్తుతించారు.

“పూర్వోత్తరే ప్రజ్వలికా నిధానే సదావసంతం, గిరిజా సమేతం!
సురాసురాధిత పాద పద్మం శ్రీ వైద్యనాథ తమహం నమామి!”

మహాశివరాత్రి నాడు ద్వాదశ జ్యోతిర్లింగాలలో పరమ పవిత్రమై, అమృత తత్వము కలిగి, మార్కండేయునిచే పూజింపబడిన వైద్యనాథ జ్యోతిర్లింగాన్ని దర్శించి జన్మచరితార్థం చేసుకుంటారు అశేష భక్తజనావళి!

☆